క్లుప్తంగా

ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): ఉద్యోగుల ఉద్యమ కార్యాచరణలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్, మున్సిపాలిటిలో 'చేయి చేయి కలుపుదాం' కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులకు సకాలం జీతాలు, దాచుకున్న పొదుపు, బకాయిలు చెల్లించాలని, ఉద్యోగులు న్యాయమైన డిమాండ్లు తీర్చాలని కోరారు. శాఖ పరమైన సమస్యలు పరిష్కారించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏపీజేఏసీ (అమరావతి) అసోసియేట్ చైర్మన్ శ్రీ ఫణి పేరారాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్ కృష్ణ మోహన్,ఏపీ రెవెన్యూ సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, శివశంకర్, జు.ఫణికుమార్ పాల్గొన్నారు.

19న జాతీయ స్థాయి మహిళ కబడ్డీ జట్టు ఎంపిక

సాక్షి, భీమవరం: హర్యానాలో ఈ నెల 23 నుంచి నాలుగురోజులు పాటు నిర్వహించే 69వ జాతీయస్థాయి సీనియర్ మహిళ ఆంధ్ర కబడ్డీ జట్టుకు ఈనెల 19న ఎంపిక జరుగుతుందని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్‌కోచ్ పి.సురేంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు బీఆర్ స్టేడియంలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రారంభమవుతుందన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారిణులు 75 కిలోల లోపు బరువు ఉండాలని సురేంద్రబాబు చెప్పారు.

విశ్వకవిలో సీబీఎస్‌సీ సిలబస్ ప్రారంభం



విశ్వకవి స్కూల్లో సీబీఎస్‌సీ సిలబస్‌ను ప్రారంభిస్తున్న కొత్తపల్లి కోదండ రామ గాంధీరాజు

సాక్షి, భీమవరం పట్టణంలో చినఅమిరం గ్రామంలో విశ్వకవి స్కూల్లో సీబీఎస్‌సీ సిలబస్ శుక్రవారం ఆధ్యాత్మిక వేత్త కొత్తపల్లి కోదండరామ గాంధీరాజు పూజా కార్యక్రమంతో ప్రారంభించారు. ఈసందర్భంగా స్కూల్ డైరెక్టర్లు పొట్లూరి రఘుబాబు, స్వరూప రాణి, కృష్ణ పార్థు మాట్లాడుతూ గత 32 సంవత్సరాలుగా విశ్వకవి స్కూల్‌ను విద్యారంగంలో విశిష్టతంగా రూపొందించామన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు.

లెప్రసీ వ్యాధిగ్రస్తులకు తోపుడుబండ్ల అందజేత



భీమవరం రాజ్‌ట్రస్ట్ కార్యాలయం వద్ద తోపుడుబండ్లు అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ప్రకృతిసైన్యం సేవా సంస్థ అనాథలు, వికలాంగులు, వితంతువులకు చేస్తున్న సేవలు ప్రసంశనీయమని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ అన్నారు. శుక్రవారం భీమవరం 11వ వార్డులోని రాజ్‌ట్రస్ట్ కార్యాలయంలో లెప్రసీ వ్యాధిగ్రస్తులకు నలుగురికి జీవనోపాధికోసం తోపుడుబండ్లు అందచేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో గంటా రాజ్‌కుమార్, పాల్‌రోనాల్డ్, దొడ్డిగర్ల గంగాధరరావు, పాలపర్తి జోనా, మరపట్ల ప్రసాద్, మాగాపు సైమాన్, సాదె మహేష్, జీడీ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పెనుగొండ: శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయ హుండీని శుక్రవారం లెక్కించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జీఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. 85 రోజులకు గానూ రూ.8,49,790, అన్నదానం హుండీ లో రూ.23,019 ఆదాయం రాగా, 19 గ్రాముల బంగారం, 80 గ్రాముల వెండి వచ్చినట్లు వివరించారు. దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో హుండీని లెక్కించగా ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ కోట్ల రామకృష్ణమోహనరావు, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

యలమంచిలి: అడవిపాలెం గ్రామంలోని సర్వలక్ష్మీ ప్రధాత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ 4వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాలకొల్లుకు చెందిన మేకుల అనిల్‌కుమార్, కృష్ణవేణి దంపతులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు గణపతి పూజ, పంచామృతాభిషేకం, సహస్ర నామ సింధూర, తమల పత్ర పూజ, నీరాజనం, మంత్ర పుష్ప వేదాశీర్వచనం ఇచ్చారు. అనంతరం 8 గంటల నుంచి 11 గంటల వరకు తూర్పు గోదావరి జిల్లా మల్లేశ్వరం వాస్తవ్యులు కోటిపల్లి నాగేశ్వరరావు భజన బృందంచే 108 హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి భక్తులకు అఖండ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఐదు గంటల నుంచి స్వామి వారి గ్రామోత్సవం చేశారు.

ఆస్తి పన్ను చెల్లింపుపై వడ్డీ రాయితీ



సమావేశంలో వడ్డీ రాయితీపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ ఎస్. శివరామకృష్ణ

భీమవరం(ప్రకాశం చౌక్): పురపాలక సంఘానికి చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిలు పై ప్రభుత్వం జీఓ 34 ద్వారా వడ్డీ రాయితీ ఇచ్చిందని భీమవరం మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు అడ్మిన్ సెక్రెటరీలుతో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడ్డీ రాయితీ విషయాన్ని పట్టణ ప్రజలకు ముఖ్యంగా పన్ను చెల్లింపుదారులకు వార్డు వలంటిర్లు, సెక్రెటరీలు తెలియజేయాలని అలాగే సోషల్ మీడియా ద్వారా అందరికి తెలిసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్తి పన్ను బకాయిదారులు అవగాహన చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇప్పటి వరకు ఉన్న బకాయిలు ఒకేసారి చెల్లిస్తేనే ఈ వడ్డీ రాయితీ అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నెల 31 వరకూ వడ్డీ రాయితీకు అవకాశం ఉంటుందని పన్ను చెల్లింపుదారులు గమనించాలని సూచించారు. నెలలో సెలవు దినాల్లో కూడా సచివాలయాలు, మునిపిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు.

జాగా పన్నుపై వడ్డీ రాయితీ

ఆకివీడు: ఖాళీ స్థలాలపై రుసుము చెల్లించేందుకు ప్రభుత్వం ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం కల్పించి, వడ్డీ రాయితీ అవకాశం ఇచ్చిందని నగర పంచాయతీ కమిషనర్ తిరుమలరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో వడ్డీ రాయితీపై ఈ నెల 31 వరకూ గడువు విధించినట్లు సూచించారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులు వడ్డీ మినహాయింపు పొందేందుకు మంచి అవకాశం వచ్చిందని ఆయన సూచించారు. పన్నులను మునిసిపల్ ఆఫీసులో గానీ, పుర సేవా యాప్ ద్వారా డెబిట్, క్రెడిట్ కార్డు ద్వారా యూపీఐ ద్వారా కానీ చెల్లించవచ్చన్నారు. సెలవు రోజుల్లో కూడా పురపాలక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో పన్నులు చెల్లించుకునే అవకాశాన్ని కల్పించామని తిరుమలరావు తెలిపారు.

సాగునీటి కోసం అధికారుల కృషి ప్రశంసనీయం



విలేకరులతో మాట్లాడుతున్న రైతు కార్యచరణ సేవా సమితి నాయకులు

సాక్షి, భీమవరం: దాళ్వావరిసాగుకు జిల్లాలో నీటిని అందించడం అధికార యంత్రాంగం చేసిన కృషి అభినందనీయమని ఏపీ రైతు కార్యాచరణ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు పెన్మెత్స గోపాలకృష్ణంరాజు, పాతపాటి మురళీరామరాజు అన్నారు. శుక్రవారం భీమవరంలో సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దాళ్వా వరి పంట సాగునీటి సరఫరా విషయంలో ముందులో ఇబ్బందులు పడ్డారని అయితే అధికారులు సకాలంలో స్పందించి వంతుల వారీ విధానంలో సాగునీటి సరఫరాలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ఇబ్బందులు తొలగాయన్నారు. ఇప్పటికీ కొన్ని కాలువ శివారు ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాటిపైన కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. దాళ్వా ధాన్యం చేతికి వచ్చే సమయానికి ధాన్యం పట్టుబడికి గోనె సంచుల ఇబ్బంది లేకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల ఆధునీకీకరణ పనులకు సంబంధించి ముందుగానే చర్యలు తీసుకోవాలని గత ఏడాది సార్వా సమయంలో సక్రమంగా చర్యలు తీసుకోకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో భూములు ముంపునకు గురై సుమారు 40 వేల ఎకరాలు నాట్లు వేయడానికి అవకాశం లేకుండా పోయిందని గోపాలకృష్ణంరాజు, మురళీరామరాజు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు పనులు త్వరితగతిని పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలని, ఇరిగేషన్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో సేవాసమితి నాయకులు శర్మ, దాట్ల లక్ష్మీపతిరాజు, ఎంఎస్ఎన్ రాజు, మంతెన కృష్ణంరాజు, తమ్మినీడి నాగేశ్వరరావు, గంటా సుందరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఫ్యాకల్టీ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు



మంత్రి బొత్స సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని వరహా గిరి, వెంకట గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కంప్యూటర్ ఫ్యాకల్టీ పోస్టు మంజూరు చేసినందుకు రాష్ట్ర విద్యా శాఖమంత్రి బొత్స సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలను కళాశాల సీపీడీసీ కార్యదర్శి, డాక్టర్ పీబీ.ప్రతాప్ కుమార్ తెలిపారు. ఈ మేరకు తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావులతో కలిసి గురువారం రాత్రి అమరావతిలోని మంత్రి కార్యాలయంలో బొత్సను కలిసినట్లు శుక్రవారం విలేకర్లకు తెలిపారు. కళాశాలలో రెండు కంప్యూటర్ ల్యాబ్‌లు ఉన్నాయని, వాటిని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నామని ప్రతాప్‌కుమార్ వివరించారు. తాత్కాలికంగా కంప్యూటర్ ఆపరేటర్‌లు పూర్తి స్థాయిలో సేవలందించలేకపోతున్నారని ఆయన తెలిపారు. దీంతో మంత్రిని కలిసి కళాశాల సమస్యను వివరించగా సానుకూలంగా స్పందించి, వెంటనే ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు.

22న ఉగాది కవి సమ్మేళనం

భీమవరం (ప్రకాశం చౌక్): స్థానిక భీమేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీరామరాజభూషణ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని సాహిత్య పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు నడింపల్లి వెంకటరాజు, రాయప్రోలు భగవాన్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ ఉగాది కవి సమ్మేళనం కార్యక్రమానికి ఐఅండ్‌పీఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.నాగార్జున, ప్రమీల విజయబాబు, వైద్యులు పీవీపీ స్వరాజ్యలక్ష్మి, కనుమూరు రాధిక, పెరుమాళ్ళ లక్ష్మి మౌనిక, రాయప్రోలు అమృతవల్లి లతోపాటు బ్రహ్మశ్రీ కందుకూరి రామకృష్ణ సూర్యనారాయణ, కోటలక్ష్మీ నరసింహ సహస్రావధాని, ఇందుకూరి లక్ష్మీపతిరాజు, సరికొండ నరసింహరాజు, తెన్నేటి లక్ష్మి నరసింహమూర్తి, రసరాజు, ఎస్వీవి రాజగోపాలాచారి, చిలకమర్తి సుబ్రహ్మణ్య శాస్త్రి, అల్లూరి రవివర్మ పాల్గొంటారని తెలిపారు.

ఉగాదికి 23 వేల ఇళ్ల గృహ ప్రవేశమే లక్ష్యం



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ ఈఈ రమణ

ఆకివీడు: తెలుగు సంవత్సరం ఉగాది నాటికి పశ్చిమగోదావరి జిల్లాలో పేదల స్వంత ఇంటి కల నెరవేర్చే దిశగా 23 వేల గృహ ప్రవేశాలు చేయించేందుకు లక్ష్యంగా గృహనిర్మాణం వేగవంతం చేసినట్లు హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణ చెప్పారు. మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో వేలాదిగా ఇళ్ల నిర్మాణం పూర్తి అయిందన్నారు. భీమవరం డివిజన్ పరిధిలో 12 వేలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి అయిందని చెప్పారు. వివిధ దశల నుంచి ప్లాస్టింగ్ వరకూ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. శ్లాబ్‌లు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధంగా పలు ఇళ్లు ఉన్నాయన్నారు. తాళ్లకోడులోని 20 మంది పట్టాదారులకు ఇచ్చిన పట్టా భూమి లెవెలింగ్ జరగలేదన్నారు. ఆ ప్రాంతంలో పంట కాలు ప్రవహించడంతో పనులు చేపట్టలేదని చెప్పారు. 20 మంది లబ్ధిదారులకు కాలనీలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో పట్టాలు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తామన్నారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు సిద్ధంగా ఉండటంతో తహసీల్దార్‌తో మాట్లాడి స్థల కేటాయింపుకు కృషి చేస్తామని చెప్పారు. లబ్ధిదారుల ఇబ్బందుల్ని త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ ఈఈ దృష్టికి తీసుకువెళ్లారు. ఈఈ వెంట హౌసింగ్ డీఈఈ పెన్మెత్స శివరామరాజు, ఏఈ ఆంజనేయరాజు, సిబ్బంది ఉన్నారు.

రక్తహీనతతో ఎన్నో అనర్థాలు

పాలకోడేరు: గర్భిణిగా ఉన్నప్పుడు ఎప్పటికప్పుడు పౌష్టికాహారం తీసుకుంటూ రక్త హీనత లేకుండా చూసుకోవాలని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రంగం నాయుడు అన్నారు. మోగల్లు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, హైపర్ టెన్షన్, మధు మేహ రోగులతో పాటు సాధారణ వైద్యం కోసం వచ్చిన వారిని పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. అనంతరం గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు వైద్యుల సలహా మేరకు మందులు వేసుకుంటూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. గర్భిణులకు ఆరు నెలలు వచ్చిన తరువాత రక్తహీనతను నివారించే విధంగా నులి పురుగులను నివారించే అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. సీహెచ్‌వో సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు ఉషా కుమారి, ఉషా సుందరి, హెల్త్ అసిస్టెంట్ బురాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గొరగనమూడిలో..

పాలకోడేరు: విద్యార్థులు ఎప్పటికప్పుడు వ్యక్తిగత పరిశుభ్రతపైన, పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉన్నప్పుడే ఆరోగ్యం భద్రంగా ఉంటుందని హెల్త్ సూపర్‌వైజర్ శంకర్ అన్నారు. గొరగనమూడి, గొల్లలకోడేరు, కుముదవల్లి, పాలకోడేరు జిల్లా పరిషత్ హైస్కూళ్లలో శుక్రవారం విద్యార్థిని, విద్యార్థులకు బరువు, ఎత్తు, హిమోగ్లోబిన్ పరీక్షలను పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రంగం నాయుడు సూచనలతో ఆయా గ్రామాల వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా గొరగనమూడి హైస్కూల్లో విద్యార్థులకు శుభ్రత, పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు ఎమ్ విజయ ప్రసాద్, శ్రీను, భురాన్ ఖాన్, ఏఎన్‌ఎంలు వేదకుమారి, ఉషారాణి, ఉషా సుందరి, కనక కుమారి పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుతో ఉపయోగం

పెనుగొండ: ఈ పంట నమోదుతో రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పెనుగొండ మండలంలో వడలిలో దాళ్వా 2023 ఈ పంట నమోదు చేసిన రైతుల వివరాల సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. రైతులు అభ్యంతరాలు ఉంటే శనివారమే సరి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ భాల నాగేశ్వరమ్మ, సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ, ఎంపీటీసీలు రెడ్డి గణేశ్వరరావు, చిటికెన దుర్గా భవానీ, పెనుగొండ మండల వ్యవసాయాధికారి పి స్పందన, ఇరగవరం మండల వ్యవసాయాధికారి వై.రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నాన్ లేఅవుట్‌లో కట్టడాల పరిశీలన

'సాక్షి'కి స్పందన



శృంగవృక్షంలో నిర్మించిన కమర్షియల్ భవనాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ వి.రెడ్డియ్య

పాలకోడేరు: 'నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు' అనే శీర్షికతో ఈ నెల 15వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా డీపీఓ ఆదేశాల మేరకు ఈవోపీఆర్‌డీ వి.రెడ్డియ్య శుక్రవారం శృంగవృక్షంలో అనధికార లే అవుట్‌లలో నిర్మించిన గృహాలను, షాపింగ్ కాంప్లెక్స్‌లను పరిశీలించారు. భవనాల నిర్మాణాలకు అనుమతులు ఎవరిచ్చారని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాన్ లేఅవుట్‌లలో అనుమతులు లేకుండా కట్టడాలు నిర్మించరాదన్నారు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక పంపిస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ వివరించారు.

పంచాయతీ షాపుల వేలం

వీరవాసరం: గ్రామ పంచాయతీకి సంబంధించిన షాపుల వేలాన్ని శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. తూర్పు చెరువు సెంటర్లోని 14 షాపులకు గానూ 12 షాపులకు మూడేళ్లకు వేలం నిర్వహించగా రూ.57.66 లక్షలు ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి జక్కంశెట్టి దుర్గా వెంకట ప్రసాద్ తెలిపారు. మరో రెండు షాపుల వేలం వాయిదా వేశామని, ఆ రెండు షాపులకు కొబ్బరి చెట్లతో కలిపి మంగళవారం వేలం నిర్వహిస్తామని ఆయన వివరించారు. సర్పంచ్ చికిల మంగతాయారు, ఈఓపీఆర్డీ షరీఫ్ సమక్షంలోఈ వేలం నిర్వహించారు.

దుర్గాలక్ష్మీ అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు

భీమవరం(ప్రకాశం చౌక్): మండలంలోని గొల్లవానితిప్ప రోడ్డులో ఉన్న శ్రీదుర్గాలక్ష్మీ అమ్మవారి హుండీలను శుక్రవారం లెక్కించగా రూ 2,25,835 లభించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి జీఎస్ సీతారామరాజు తెలిపారు. గత 6 నెలల కాలంలో భక్తులు అమ్మవారికి హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించగా పై ఆదాయం లభించిందని పేర్కొన్నారు. అలాగే చీరలు ద్వారా రూ 32,300 ఆదాయం వచ్చిందని సీతారామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పి.సూర్యారావు పాల్గొన్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



ఆలయ శిఖరానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్న మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు దంపతులు

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి మందిరంలో పుష్కరోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం విశేష హోమాలు నిర్వహించారు. అనంతరం మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులు, అలయ చైర్మన్ కంతేటి వెంకట్రాజు, అంతర్వేది వశిష్ట ఆశ్రమం ప్రసాద గురువారేణ్యులు,ఆనంద విశ్వనాథరాజు, ఎంపీపీ పేరిచర్ల నరసింహరాజు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు,గొలుగూరి వెంకటరెడ్డి దంపతులు పలువురు ప్రముఖులు పాల్గొని అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి కుక్కల బాల,సభ్యులు జానపాటి మధుసూదనరావు, తాడికొండ కోటేశ్వరరావు గుప్త, సరిపిడకల రామారావు,మట్టా నలినిమోహన్, గొన్నాబతుల మల్లేశ్వరరావు, కడలి వెంకటేశ్వరరావు,కాకులపటి భానుమూర్తి, కడలి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించడానికి క్రీడలు దోహదం



భీమవరం డీఎన్నార్ కళాశాల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో విజేతలను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా వారిలోని నైపుణ్యాలను వెలికితీయవచ్చునని భీమవరం డీఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) అన్నారు. డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా బాబు మాట్లాడారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడానికి మూడు రోజులపాటు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడలు శారీరక దారుఢ్యానికి దోహదపడడమేగాక ఉపాధికి కల్పనకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రిన్సిపాల్ ఎం.అంజన్‌కుమార్ మాట్లాడుతూ నేటి ఆధునికయుగంలో శారీరక దృఢత్వంతో పాటు సవాలు చేసే స్ఫూర్తి, సహకార స్ఫూర్తి, క్రమశిక్షణ, సహనం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు ప్రసంశాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బీవీఎస్ వర్మ, పిజికల్ డైరెక్టర్ పి నర్సింహరాజు తదితరులు పాల్గొన్నారు.

పాములపర్రు చెరువు పరిశీలన



పాములపర్రులో చెరువు సరిహద్దుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

ఉండి: మండలంలోని పాములపర్రులో దళితుల చెరువు ఆక్రమణపై గత కొద్ది రోజులుగా అధికారులకు దళితుల వినతుల మేరకు అధికారులు స్పందించారు. శుక్రవారం ఆర్డీఓ దాసి రాజు, మాలమహానాడు రాష్ట్రాధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్, జేఏసీ యాక్షన్ కమిటీ ప్రతినిధులు, రెవెన్యూ, గ్రామ పంచాయితీ అధికారులు పాములపర్రు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో చెరువు సరిహద్దులు కలిగిన మ్యాప్‌ను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి పూర్వకాలం చెరువు ఉండే పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే చెరువును పూర్తిస్థాయిలో కొలతలు వేయించి సరిహద్దులు నిర్ణయిస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కేశన శాంతకుమారి, బలుసులరావు, తహసీల్దార్ ఎం.రవీంద్రకుమార్, బహుజన జేఏసీ రాష్ట్రాధ్యక్షుడు కోనా జోసఫ్, కన్వీనర్ తాళ్ళూరి మధు, బిరుగుకోట రమేష్, మాలమహానాడు నాయకులు సంధి జయరాజు, నేతల సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

దళితులకిచ్చిన హామీలు అమలు చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న మధు

సాక్షి, భీమవరం: పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామంలోని దళితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి. మధు డిమాండ్ చేశారు. గరగపర్రు దళితుల గ్రామ బహిష్కరణపై పెట్టిన కేసుకు సంబంధించి శుక్రవారం కోర్టుకు హాజరైన మధు విలేకర్లతో మాట్లాడారు. 2017లో గరగపర్రు గ్రామంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం విషయంలో తలెత్తిన వివాదంలో గ్రామ దళితులను వెలివేశారన్నారు. అప్పటి పోరాటంలో సీపీఎం, ప్రజాసంఘాలు, ఇతర స్వచ్ఛంద సంస్థలు, దళిత సంఘాలు ప్రధాన పాత్ర పోషించాయని అయితే అప్పట్లో ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలు అమలుకాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీలను అమలు చేయాలన్నారు. కోర్టుకు హాజరైన వారిలో సీపీఎం నాయకులు మంతెన సీతారాం, దడాల సుబ్బారావు, బి.బలరాం, జేఏస్వీ గోపాలన్, సిహెచ్ బాబురావు తదితరులున్నారు.

విద్యార్థి దశలోనే తీర్చిదిద్దుకోవాలి



భీమవనం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో మౌనిక, అంజనీకుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే తనను తాను తీర్చిదిద్దుకుంటే ప్రపంచంలో ఎన్నో మంచి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని విశాఖపట్నం జీఎస్టీ సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గ్రంధి మౌనిక, ఆదాయ పన్ను శాఖాధికారి గ్రంధి అంజనీకుమార్ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిపుణ-23 జాతీయస్థాయి విద్యార్థి సింపోజియం ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. తామిద్దరం కళాశాల పూర్వ విద్యార్థులమేనని కళాశాలలో అందుబాటులో ఉన్న వివిధ సాంకేతిక విభాగాలలో చేరడం వల్ల చక్కని వాక్చాతుర్యం, భాషపై పట్టు, సమస్యను వివరించడం వంటి టెక్నిక్స్ నేర్చుకోవడం వల్లనే తాము చదువుకున్న కళాశాల కార్యక్రమానికి అతిథులుగా రాగలిగామన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ, ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ తమ కళాశాల పూర్వ విద్యార్థులు కళాశాల ప్రగతి చిహ్నాలన్నారు. దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న తమ విద్యార్థులు తరచూ కళాశాలకు వచ్చి కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొనడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. ఈ సందర్భంగా మౌనిక, అంజనీకుమార్‌లను ఘనంగా సత్కరించారు. సాగి విఠల్‌రంగరాజు, పి.సుబ్బారావు, రామ్‌గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.